సాక్షి కర్నూలు

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేపట్టారు.



రమణీయం.. రథోత్సవం

కొత్తపల్లి: ఎదురుపాడు గ్రామంలో సోమవారం సీతారామ స్వామివారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మేళతాళాలు, కళాకారుల విన్యాసాల మధ్య వైభవంగా సాగింది.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన ఎం.విజయ గురుదత్త వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- నంద్యాలలో గరిష్టంగా 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కర్నూలు (అగ్రికల్చర్): ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈ నెలలో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరే అవకాశమున్నట్లు విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు పేర్కొన్నారు. కర్నూలులోని ప్రధాన కూడళ్లలో ఎట్టకేలకు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తుండటం విశేషం. సోమవారం నంద్యాలలో 41.5 డిగ్రీలు, రుద్రవరంలో 41.1, కౌతాళంలో 41.1 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా రానున్న రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

డీబీసీడబ్ల్యూఈఓ బాధ్యతల స్వీకరణ



నూతన డీబీసీడబ్ల్యూఈఓ ప్రసూనను సత్కరిస్తున్న అసోసియేషన్ నేతలు


కర్నూలు(అర్బన్): జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణిగా కే.ప్రసూన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బీసీ సంక్షేమ శాఖల్లో ఇటీవల జరిగిన పదోన్నతుల్లో భాగంగా నెల్లూరు సహాయ బీసీ సంక్షేమ శాఖ అధికారిణిగా ఉన్న ప్రసూనను డీబీసీడబ్ల్యూఈఓగా పదోన్నతి కల్పించి ప్రభుత్వం ఇక్కడకు బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని సహాయ బీసీ సంక్షేమాధికారులు, బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం నేతలు ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. సహాయ బీసీ సంక్షేమాధికారులు ఆంజనేయులునాయక్, రాజా కుళ్లాయప్ప, అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పాలెగార్ సత్యనారాయణరాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. నూతన డీబీసీడబ్ల్యూఓ మాట్లాడుతూ.. జిల్లాలోని వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

శరవేగంగా పది మూల్యాంకనం

కర్నూలు సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం శరవేగంగా కొనసాగుతోంది. ఈ నెల 3వ తేదీన మొదలైన స్పాట్ సోమవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. మొదటి రోజున హిందీ, తెలుగు, సోషల్ సబ్జెక్టులకు సిబ్బంది కొరత వచ్చింది. కస్తూర్బా స్కూళ్ల టీచర్లతో పాటు, మరి కొంత మందికి ఉత్తర్వులు ఇవ్వడంతో వారు విధులు చేరడంతో రెండో రోజు నుంచి మూల్యాంకనంలో వేగం పుంజుకుంది. ఈ నెల 9వ తేదీన క్యాంపు ముగించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు మూల్యాంకన ప్రక్రియను వేగవంతం చేశారు. 1,44,180 పేపర్లు జిల్లాకు రాగా, ఇందులో 75.31 శాతం మూల్యాంకనం పూర్తి చేసినట్లు డీఈఓ ఎస్.శామ్యూల్‌పాల్ తెలిపారు. ఇందులో మొత్తం 116 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 690 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 202 మంది స్పెషల్ అసిస్టెంట్లు పాల్గొన్నారని, సిబ్బందికి ఎక్కడా కూడా అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ పేర్కొన్నారు.

మంత్రి చెప్పారని.. తన మాటే నెగ్గాలని!

మంత్రి పేరు చెప్పుకొని ఓ టీడీపీ నేత మున్సిపల్ కార్పొరేషన్‌లో చక్రం తిప్పుతున్నాడు. వెనుకా ముందు ఆలోచించకుండా అధికారులు సైతం ఆయనకే వంతపాడుతున్నారు. ఈయన తీరుపై అధికార పార్టీకే చెందిన ఇద్దరు నేతలు ఫిర్యాదు చేసే స్థాయికి ఆయన దందా చేరుకుంది. ఇతను కార్పొరేటర్ కావడం.. మంత్రి వెంట తిరుగుతుండటంతో నిజంగా మంత్రి మద్దతు ఉందేమోనని అధికారులు సైతం చకచకా పనులు చక్కపెడుతుండటం గమనార్హం.



కార్పొరేషన్‌లో చక్రం తిప్పుతున్న ఓ టీడీపీ నేత

- మున్సిపల్ అధికారులు సైతం ఆయనకే వత్తాసు
- ఏకంగా మంత్రి సిఫారసు లేఖకే దిక్కులేదు
- ఉన్న వాళ్లను తొలగించి కొత్త నియామకాలు
- ఇందుకోసం భారీ ఎత్తున వసూళ్లు
- కోడి వ్యర్థాల టెండర్, జంగిల్ క్లియరెన్స్‌పై దృష్టి

కర్నూలు(టౌన్): టీడీపీ నేతలు నాలుగు రాళ్లు వెనకేసుకునే పనిలో తలమునకలు అవుతున్నారు. నాయకుల పేరు చెప్పి అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చిత్తశుద్ధి లేని నాయకులు.. కొంత డబ్బు మిగులుతుందంటే చాలు, ఇట్టే వాలిపోతున్నారు. ఈ విషయంలో కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని ఓ కార్పొరేటర్ కాస్త ముందున్నారు. మంత్రికి సన్నిహితంగా మెలుగుతూ, ఆయన పేరు వాడుకుని ఏకంగా కార్పొరేషన్‌నే తన గుప్పిట్లో పెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. నగరంలోని ఒకటవ వార్డుకు చెందిన టీడీపీ సానుభూతిపరుడు మంత్రి సిఫారసు లేఖతో నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో తాత్కాలిక ఒప్పంద కార్మికునిగా చేరేందుకు అధికారిని కలిశాడు. అయితే ఓ నేత సిఫారసు ఉంటేనే చేర్చుకుంటామని సదరు అధికారి చెప్పడంతో ఆ వ్యక్తి విస్మయానికి లోనయ్యాడు. మంత్రి సిఫారసుకే దిక్కులేకుండా పోయిందనుకుని వెనుతిరిగాడు. ఇటీవల ఆ విభాగంలో చాలాకాలంగా తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను ఉన్నఫళంగా తొలగించారు. ఈ విషయంలో కార్పొరేషన్‌కు చెందిన ఓ నేత ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న చిరుద్యోగులు రోడ్డునపడ్డారు. తాజాగా సదరు నేతలు కొత్త నియామకాలను చేపడుతూ వారి నుంచి రూ.వేలల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం.



నగర పాలక సంస్థ కార్యాలయం

కోడి వ్యర్థాల సేకరణకు 'టెండర్'

నగరంలో చికెన్ బంకుల నుంచి వెలువడే వ్యర్థాల సేకరణకు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారులు టెండర్ పిలిచి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేవారు. గతంలో చికెన్ వ్యర్థాలకు సంబంధించి కర్నూలు నియోజకవర్గం, పాణ్యం అర్బన్, కోడుమూరు అర్బన్ ప్రాంతాలను రెండుగా విభజించి బహిరంగ వేలం నిర్వహించారు. తద్వారా కర్నూలు కార్పొరేషన్‌కు ఏడాదికి దాదాపు రూ.కోటి ఆదాయం సమకూరుతుంది. ఇప్పుడు ఇదే టెండర్‌పై సదరు నేత కన్నుపడింది. కర్నూలు నియోజకవర్గానికి చెందిన ఇరువురు మాజీ కార్పొరేటర్లను కలుపుకొని ఎలాగైనా ఆ టెండర్ దక్కించుకునేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నగరపాలక సంస్థకు చెందిన ఇరువురు అధికారులతో చర్చలు పూర్తికాగా.. టెండర్ లేకుండా నామినేషన్ పద్ధతిలో పనులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

నేతల సేవలో తరిస్తున్న అధికారి

ఓ అధికారి విధి నిర్వహణ కన్నా.. కూటమి నేతలు, చోటామోటా నాయకులు, చివరకు వార్డు ఇంచార్జీల సేవలోనూ తరిస్తున్నాడు. ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తూ కొందరు టీడీపీ నేతలు టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం, రెవెన్యూ విభాగాల్లో పైరవీలు ముమ్మరం చేశారు. ఈ కారణంగా పనులు ముందుకు సాగడం లేదని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఏదైనా పని ఉన్నప్పుడు కలవడం మంచిదే కానీ, ఆ పని పేరుతో ముగ్గురు, నలుగురు ఓ అధికారి వద్ద గంటల కొద్దీ కూర్చోవడం విమర్శలకు తావిస్తోంది.

జంగిల్ క్లియరెన్స్ పనులపైనా కన్ను

నగరంలోని హంద్రీ నది వెంట జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టేందుకు నగరపాలక సంస్థ రూ.50 లక్షలతో టెండర్ పిలుస్తోంది. ఈ పనుల్లో అందిన కాడికి దోచుకోవచ్చన్న ఉద్దేశం కనిపిస్తోంది. ఇంజినీరింగ్ అధికారులు సైతం బినామీ పేరుతో కార్పొరేషన్‌లో చక్రం తిప్పుతున్న టీడీపీ నేతకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. జంగిల్ క్లియరెన్స్ పనులంటే.. జేసీబీ పెట్టడం, గంటల పద్ధతిన పని చేయడం, ఎన్ని గంటలు పనిచేశారు.. ఎంత సమయం అని రికార్డు చేయడం మాత్రమే ఉంటుంది. ఈ విషయంలో పర్యవేక్షణ పెద్దగా ఉండదనేది బహిరంగ రహస్యం. పనులను తూతూమంత్రంగా చేపట్టి, సగం కూడా పూర్తి చేయకుండా మొత్తం పనికి బిల్లు చేసుకోవడం ఇక్కడ పరిపాటి. ఈ నేపథ్యంలో సదరు నేత కన్ను ఈ పనిపై పడినట్లు తెలుస్తోంది.

రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేశారు

- ఎస్పీని ఆశ్రయించిన బాధితుడు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు(టౌన్): రైల్వేలో డబుల్ ట్రాక్ లైన్ పని చేయించేందుకు సూపర్‌వైజర్ ఉద్యోగమిస్తామని చెప్పి జొహరాపురానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి రూ.1.20 లక్షలు తీసుకుని మోసం చేశాడని కల్లూరు మండలం చెంచునగర్‌కు చెందిన పి.ప్రసాద్ ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధ్యక్షతన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నుంచి వచ్చిన పలువురు బాధితులు ఎస్పీని కలిసి వినతిపత్రాలు అందజేశారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 125 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుసేన్ పీరా, సీఐలు శ్రీనివాస నాయక్, ఇబ్రహీం పాల్గొన్నారు.

మరింత పడిపోయిన మిర్చి ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధరలు మరింత పడిపోయాయి. మిర్చిలో తేజ, బ్యాడిగ, ఆర్మూర్ తదితర రకాల్లో ఏ ఒక్క రకం ధర రూ.10 వేలు దాటలేదు. ఎరుపు రకానికి గరిష్ట ధర రూ.9,999, బ్యాడిగ రకానికి రూ.9,411 వరకు ధర లభించింది. మిగిలిన రకాలకు ధరలు మరింత అధ్వానంగా లభించడం గమనార్హం. రెండు నెలల క్రితం మిర్చి రైతులను ఆదుకుంటామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హంగామా చేశాయి. ధరలు పడిపోయి రైతులు అల్లాడుతున్నప్పటికీ ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. మిర్చితో పాటు వేరుశనగ, ఉల్లి, సజ్జలు, కందుల ధరలు మరింత పడిపోయాయి.

కక్ష కట్టి.. పంటను నీట ముంచి



కంది కుప్పల్లో పారిన నీరు



దెబ్బతిన్న కంది కుప్పలను చూపుతున్న శ్రీనివాసరెడ్డి

- కంది కుప్పలపై నీరు పారించిన రాజకీయ ప్రత్యర్థులు
- వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన ఐదు ఎకరాల్లో పంట నష్టం

పగిడ్యాల: పాత ముచ్చుమర్రిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, బైరెడ్డి సిద్దార్థరెడ్డి వర్గీయుడైన చల్లా శ్రీనివాసరెడ్డిపై రాజకీయ ప్రత్యర్థులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. చల్లా శ్రీనివాసరెడ్డి దాదాపు ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని రబీ సీజన్‌లో కంది సాగు చేశాడు. పంట కోత దశకు రాగా ఈనెల 4న కోత కోసి పొలంలోనే కుప్పలు వేసి సొంత పని మీద కడపకు వెళ్లాడు. ఆయన ఊర్లో లేని సమయం చూసి రాజకీయ ప్రత్యర్థులు ఆదివారం కోసిన కంది పంట కుప్పలపై నీరు పారించారు. సాయంత్రం గ్రామానికి రాగానే పొలానికి వెళ్లి చూడగా తన పొలమంతా నీరు పారి కంది కట్టె కుప్పలు కుళ్లిపోయి కనిపించాయి. గింజలు ఉబ్బిపోయి మొలకలు రావడంతో కన్నీరుమున్నీరయ్యాడు. ప్రస్తుతం ఎకరాకు 9 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా.. దాదాపు 40 క్వింటాళ్ల మేర నష్టం వాటిల్లింది. పెట్టుబడి ఖర్చులు, కౌలు రూ.2 లక్షలు చెల్లించి పంట దిగుబడి కోసం నిరీక్షించగా అంతా నీటిపాలు చేశారని బాధితుడు వాపోయాడు. జరిగిన ఘటనపై ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో పంటను పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడి హౌస్ అరెస్ట్

- రథోత్సవంలో పాల్గొనకుండా పోలీసుల నోటీసులు



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కూటమి నేతలు గ్రామాల్లోనూ రాజకీయ చిచ్చు రగులుస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తున్న గ్రామాలపై పగబడుతున్నారు. టీడీపీ నేతల నిర్ణయానికి పోలీసులు కూడా వంత పాడుతుండటం విమర్శలకు తావిస్తోంది. తాజాగా కొంగనపాడులో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే రథోత్సవానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొనకుండా అడ్డుకున్నారు. పోలీసులు ఆయనను హౌస్ అరెస్టు చేసి కనీసం దర్శనానికి కూడా వెళ్లకుండా చేశారు. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని కల్లూరు మండలం కొంగనపాడు గ్రామంలో సీతారాముల రథోత్సవం నిర్వహిస్తారు. సోమవారం సాయంత్రం నిర్వహించనున్న ఈ రథోత్సవానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యేందుకు సిద్ధమవ్వగా కర్నూలు పోలీసులు నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో కల్లూరులోని ఆయన నివాసానికి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కాటసాని మీడియాతో మాట్లాడారు. తాను 2009 నుంచి 2024 వరకు ఎమ్మెల్యేగా ఉన్నా.. లేకున్నా ప్రతి ఏడాది జరిగే సీతారాముల రథోత్సవానికి హాజరవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 2014–2019 మధ్య టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ రథోత్సవంలో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. పొరపాటున కూడా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదన్నారు. 2024 ఎన్నికల్లో కూడా గ్రామంలో మెజార్టీ వచ్చిందని, దీన్ని జీర్ణించుకోలేకనే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు, పోలీసులు గ్రామంలో ఉన్నది ప్రభుత్వ దేవాలయం కాదని తెలుసుకోవాలన్నారు. పోలీసుల సహకారంతో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తనను అడ్డుకుంటున్నారన్నారు. రథానికి డబ్బులు ఇచ్చింది కూడా ఎక్కువ శాతం తన అనుచరులేనన్నారు. తమ ప్రభుత్వంలో ఇలాంటి దుశ్చర్యలకు ఎప్పుడూ పాల్పడలేదని, అందరికీ దర్శనాలకు అవకాశం కల్పించామన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఆయన వెంట నాయకులు కాటసాని శివనరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ రేణుక, పలువురు కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదరికం.. అపహాస్యం!

పీ-4 ముసుగులో ప్రభుత్వం దగా

- ఎన్నికల హామీలను విస్మరిస్తున్న నేతలు
- ప్రజల దృష్టి మళ్లించేందుకు ఎత్తుగడ
- ప్రైవేటు చేతికి ప్రజల సమాచారం
- అత్యంత నిరుపేదలుగా 1.15 లక్షల కుటుంబాలు



కర్నూలు(అగ్రికల్చర్): 2024 ఎన్నికల సమయంలో అధికారమే లక్ష్యంగా ఇబ్బడిముబ్బడిగా హామీలను గుప్పించిన కూటమి నేతలు ఇప్పుడు చేతులెత్తేస్తున్నారు. ప్రధాన హామీలు అమలు కాకుండానే సంవత్సరం గడుస్తోంది. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత రోజురోజుకూ చాపకింది నీరులా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించేందుకు పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏదో చేస్తున్నారనే భ్రమ కల్పిస్తున్నారు. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పీ-4 సర్వేను తెరపైకి తీసుకొచ్చారు. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్‌షిప్ పేరుతో పేదలకు ఏదో చేయబోతున్నట్లు హంగామా చేస్తున్నారు. పీ-4 కార్యక్రమం కింద ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదు. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు, సంపన్నులు, సంస్థల ద్వారా పేదరిక నిర్మూలన చేస్తామంటూ ఇటీవల చంద్రబాబు చేస్తున్న హడావుడి చూసి ప్రజలు విస్తుపోయే పరిస్థితి ఏర్పడింది.

1.15 లక్షల కుటుంబాలు ఎంపిక

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు జిల్లాలో 5,40,248 కుటుంబాలను పీ-4 కోసం సర్వే చేశారు. ఇంట్లో టీవీ, ఫ్రిజ్, గ్యాస్, విద్యుత్ కనెక్షన్‌తో పాటు మంచినీటి కుళాయి, సొంత ఇల్లు లేని వారిని అత్యంత నిరుపేదలుగా పరిగణిస్తారు. నేడు గుడిసెల్లో నివాసం ఉన్నవారు కూడా టీవీ, గ్యాస్ వినియోగిస్తున్నారు. కరెంటు లేని ఇళ్లు దాదాపుగా కనిపించవు. అత్యంత నిరుపేదలుగా జిల్లాలో 1.15 లక్షల కుటుంబాలను గుర్తించారు. అట్టడుగున ఉన్న ఈ కుటుంబాలను కార్పొరేట్, ప్రైవేటు కంపెనీలు, అత్యంత సంపన్నులతో అనుసంధానం చేసి వారి ద్వారా దారిద్ర్య రేఖపైకి తీసుకురావాలనేది ప్రధాన లక్ష్యం. ఈ సర్వే వివరాలను ప్రభుత్వమే ప్రైవేటు కంపెనీలకు, వ్యక్తులకు అప్పగిస్తోంది. పేదరిక నిర్మూలన అనేది పూర్తిగా ప్రభుత్వ బాధ్యత. కానీ కూటమి ప్రభుత్వం ఈ బాధ్యత నుంచి తప్పుకొని ప్రజల సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వమే సేకరించి ప్రైవేటుకు అప్పగిస్తుండటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సామాజిక బాధ్యత విస్మరించిన కంపెనీలు

పీ-4 కోసం జిల్లా యంత్రాంగం 14 కంపెనీలను ఎంపిక చేసింది. నిబంధనల ప్రకారం కార్పొరేట్ కంపెనీలు, పెద్దపెద్ద సంస్థలు సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ప్రభుత్వ ప్రమేయం లేకుండానే పేదరిక నిర్మూలనకు ముందుకు రావచ్చు. అయితే కొన్ని కంపెనీలు తమ బాధ్యతను పూర్తిగా విస్మరించాయి. పన్నుల నుంచి మినహాయింపు పొందేందుకు కొన్ని సంస్థలు పిసరంత చేసి కొండంత ప్రచారం చేసుకుంటున్నాయి.

బంగారు కుటుంబాలుగా మారుస్తారంట...

జిల్లాలో పూరెస్ట్ ఆఫ్ పూర్ కింద ఎంపిక చేసిన 1.15 లక్షల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మారుస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ కుటుంబాల్లోని సభ్యులు దాదాపు జిల్లాలో దాతలుగా ఎంపిక చేసిన కంపెనీలు, సంస్థలు తదితరుల వద్ద పని చేస్తున్న వారే కావడం గమనార్హం. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలను అమలు చేస్తే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుంది. కానీ వీటిని పూర్తిగా పక్కన పెట్టిన పీ-4 ముసుగులో ప్రయివేటును తెరపైకి తీసుకొస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లు ప్రకటించిన విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేసింది. ఈ పథకాల వల్ల పేదరికం గణనీయంగా తగ్గింది. అయితే ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు అధికారం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాల కంటే ఎక్కువగా ఇస్తామని ప్రజలను నమ్మించారు. ఇందులో భాగమే సూపర్-6 హామీ. అధికారంలోకి రాగానే ఈ పథకాలను కూటమి ప్రభుత్వం గంగలో కలిపేసింది. అయితే ప్రజల దృష్టి మరల్చేందుకు పేదరిక నిర్మూలన పేరిట హడావుడి చేస్తుండటం గమనార్హం.

జిల్లాలో ఎంపిక చేసిన కంపెనీలు

- రాయలసీమ ఆల్కాలీస్ కెమికల్స్
- రాయలసీమ హై స్ట్రెంత్ హైపో లిమిటెడ్
- రాయలసీమ గ్రీన్ స్టెల్లో ఇండస్ట్రీస్
- మారుతి ఇస్పాత్ ఎనర్జీ లిమిటెడ్
- అదాని విల్‌మార్ ప్రైవేటు లిమిటెడ్
- ప్రైస్‌బౌల్ హార్టికల్చర్
- జయరాజ్ ఇస్పాత్ లిమిటెడ్
- సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్
- జియో మైసూర్ సర్వీస్
- గ్రీన్‌కో ఐఆర్‌ఈపీ
- చాంబర్ ఆఫ్ కామర్స్
- క్లాత్ మర్చెంట్స్ అసోసియేషన్
- ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్
- రైస్ మిల్స్ అసోసియేషన్

కూటమి ప్రభుత్వం విస్మరించిన ప్రధాన హామీలు కొన్ని..


- అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20వేలు.
- ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1,500.
- తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ.15వేలు.
- ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి.
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.
- 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛను.

పలువురు అదనపు జిల్లా జడ్జీల బదిలీ

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అదనపు జిల్లా జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

- మొదటి అదనపు కోర్టు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.భూపాల్‌రెడ్డిని విజయవాడ ఏసీబీ కోర్టుకు బదిలీ చేసి ఆయన స్థానంలో కాకినాడలో పనిచేస్తున్న పి.కమలాదేవిని నియమించారు.
- ఆరో అదనపు కోర్టు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న పి.పాండురంగారెడ్డిని కృష్ణాజిల్లా మచిలీపట్నంకు బదిలీ చేసి ఆయన స్థానంలో నంద్యాలలో పని చేస్తున్న పి. వాసును నియమించారు.
- ప్రకాశం జిల్లా మొదటి అదనపు జడ్జి డి.అమ్మనరాజును నంద్యాల మూడో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు.
- అనంతపురంలో పనిచేస్తున్న ఎం.శోభారాణిని ఖాళీగా ఉన్న కర్నూలు సీబీఐ కోర్టు న్యాయమూర్తిగా బదిలీ చేశారు.
- అనకాపల్లిలో పనిచేస్తున్న శ్రీవిద్యను ఖాళీగా ఉన్న ఏసీబీ కోర్టు న్యాయమూర్తిగా నియమించారు.
- ఆళ్లగడ్డలో పనిచేస్తున్న ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణను ఏలూరుకు బదిలీ చేసి కర్నూలు ఫ్యామిలీ కోర్టు జడ్జికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈనెల 21లోపు ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని హైకోర్టు రిజిస్ట్రార్ ఆదేశాలు జారీ చేశారు.

సీఐల బదిలీ



కర్నూలు: రాయలసీమ జోన్‌లోని కర్నూలు, అనంతపురం రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేశారు. కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.దస్తగిరి బాబు	డీటీసీ, అన్నమయ్య	నంద్యాల జిల్లా శిరివెళ్ల సర్కిల్
ఎస్.వంశీధర్	శిరివెళ్ల సర్కిల్, నంద్యాల	వీఆర్, నంద్యాల
వి.ప్రభాకర్‌రెడ్డి	ఎస్సీ ఎస్టీ సెల్, అన్నమయ్య జిల్లా	ఫ్యాక్షన్ జోన్, నంద్యాల
ఎం.పార్థసారథి	ఫ్యాక్షన్ జోన్, నంద్యాల	డీటీసీ, కర్నూలు
పి.గౌతమి	డీటీసీ, కర్నూలు	మహిళా పీఎస్-1, నంద్యాల జిల్లా
జె.రమేష్ కుమార్	మహిళా పీఎస్-1, నంద్యాల జిల్లా	వీఆర్, నంద్యాల
యు.లక్ష్మయ్య	వీఆర్, కర్నూలు	సీసీఎస్ 3, నంద్యాల జిల్లా
ఎస్.కృష్ణయ్య	సీసీఎస్3, నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
ఎ.ఆదినారాయణరెడ్డి	డీసీఆర్‌బీ, నంద్యాల	డీటీసీ, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

తల్లి మందలించిందని ఆత్మహత్య

ఆదోని అర్బన్: స్థానిక క్రాంతినగర్‌కు చెందిన ఉరుకుందప్ప కుమార్తె ఇందూ (20) తల్లి మందలించడంతో ఇంట్లో నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఔట్ పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందూ ఇంట్లో సెల్‌ఫోన్ చూస్తుండటంతో తల్లి స్వాతి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన యువతి నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబసభ్యులు మంటలు ఆర్పి చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలోనే యువతి మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపారు.

యువకుడి అదృశ్యం



అభిరామ్ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని శివశంకర్‌నగర్ కాలనీకి చెందిన రామాంజనేయులు, మహాలక్ష్మి దంపతుల కుమారుడు అభిరామ్ ఆదివారం నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఉపాధ్యాయుడైన తండ్రి రామాంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం అభిరామ్ ఫ్రెండ్ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడని రాత్రయినా తిరిగి రాకపోవడంతో స్నేహితులు, బంధువులకు ఫోన్ చేసి విచారించినా ఆచూకీ తెలియలేదన్నారు. రాత్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు చెప్పారు. అభిరామ్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడన్నారు.

సంగమేశ్వరాలయానికి విద్యుత్ సౌకర్యం



ఆలయంలో వెలుగుతున్న విద్యుద్దీపం

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరాలయం కృష్ణాజలాల నుంచి పూర్తిగా బయటపడింది. దీంతో ఆలయంలో భక్తుల పూజలు మొదలయ్యాయి. ఆలయంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ విద్యుత్ శాఖ వారితో మాట్లాడి ఎగువ నుంచి ప్రాచీన ఆలయానికి సోమవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో భక్తులకు ఇబ్బందులు తప్పాయి. గర్భాలయంలో, ముఖ మండపంలో, ఆలయ ప్రాంగణంలో విద్యుత్ సౌకర్యం కల్పించారు.

'మర్రి' మమత.. 'ఊడల' లాలన



రామళ్లకోట సమీపంలోని పచ్చదనం అలుముకున్న మర్రిమాను

పది.. వంద కాదు.. ఏకంగా 700 ఏళ్ల క్రితం నాటి వృక్షం అది. ఊడల ఊతంతో ఇప్పటికీ సజీవంగా ఉంది. వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామ సమీపంలోని కాల్వబుగ్గ రహదారి పక్కన కనువిందు చేస్తోంది. ఈ మహా మర్రిమాను ఊడలు 100కు పైగా భూమిలోకి చొచ్చుకుపోయి కనిపిస్తున్నాయి. ఈ వృక్షం బాటసారులకు, చుట్టుపక్కల పొలాల రైతులకు, పశువులకు, పక్షులకు నీడనిస్తూ మమత పంచుతోంది. వృక్షం కిందకి వెళ్లిన మనుషులను ఊడలు లాలిస్తుంటాయి.



భూమిలోకి చొచ్చుకుపోయిన ఊడలు

అపూర్వ అనుభవాన్ని పంచుతుంటాయి. ఇక్కడ పుట్ట ఏర్పడడంతో స్థానికులు నాగప్రతిమలను ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. – వెల్దుర్తి

అదుపుతప్పితే అంతే!



ట్రాక్టర్ బంపర్, నూర్పిడి యంత్రంపై కూర్చొని వెళ్తున్న కూలీలు

అప్రమత్తత లేకపోవడం, ఏమరపాటు వల్ల పంట నూర్పిడి యంత్రాల్లో పడి ఎంతో మంది వ్యవసాయ కూలీలు దుర్మరణం చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినా రెక్కాడితే గానీ డొక్కాడని వ్యవసాయ కూలీలు తప్పనిసరి పరిస్థితుల్లో ఆ పనులకు వెళుతుంటారు. ఇలాంటి వారు పంట నూర్పిడి చేసే ప్రాంతానికి వెళ్లేందుకు ట్రాక్టర్, నూర్పిడి యంత్రంపై కూర్చొని ప్రమాదకర స్థితిలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సోమవారం తాటిపాడు గ్రామానికి చెందిన కొందరు వ్యవసాయ కూలీలు ట్రాక్టర్ ముందున్న బంపర్, నూర్పిడి యంత్రంపై ప్రమాదకరస్థితిలో కూర్చొని పంట నూర్పిడి పనులకు బయలుదేరారు. యంత్రం ఏమాత్రం అదుపుతప్పినా కూలీల ప్రాణాల మీదకు వచ్చినట్లే. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది. – జూపాడుబంగ్లా

'పచ్చని' గొడుగు



పెరవలి గ్రామ సమీపంలో చల్లదనం పంచుతున్న వృక్షాలు

ఒకప్పుడు రోడ్ల పొడవునా కనిపించే చెట్లు ప్రయాణికులకు నీడనిస్తూ చల్లదనాన్ని పంచేవి. రోడ్ల వెడల్పుల పేరుతో ఇప్పుడు వాటిని కూకటి వేళ్లతో పెకిలించి వేస్తున్నారు. ఫలితంగా రోడ్డు మధ్యలో ఎక్కడైనా సేదతీరుదామన్నా నీడ దొరకని పరిస్థితి. కొత్త రోడ్లు వేసిన తర్వాత చెట్లు నాటాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చొరవ చూపని పరిస్థితి. ఈ కారణంగానే వాతావరణం వేడెక్కి లేనిపోని అనారోగ్యాలకు కారణమవుతోంది. ఇలాంటి రోజుల్లో మండల పరిధిలోని పెరవలి గ్రామ పరిసరాల్లో హంద్రీనీవా కాలువ సమీపాన రోడ్డు పక్కన భారీ వృక్షాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్డుకు గొడుగులా మారి చల్లని గాలులతో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పిస్తున్నాయి. – మద్దికెర

అక్రమ తవ్వకాల అడ్డగింత

- అధికార పార్టీ అండతో చెలరేగిపోతున్న మట్టి మాఫియా
- ఉప్పలపాడు నుంచి స్టీల్ ప్లాంట్ పైపులైన్ నిర్మాణ పనులకు మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న ఏపీఐఐసీ అధికారులు



ఇటాచీతో టిప్పర్‌లో మట్టిని నింపుతున్న దృశ్యం



మట్టి తరలింపుదారుడితో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు రెవెన్యూ పరిధిలో మట్టి అక్రమ తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఉప్పలపాడు గ్రామానికి చెందిన సుమారు 800 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. సదరు భూములు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ భూములు అధికార పార్టీ నాయకులకు ఆర్థిక వనరులుగా మారాయి. ఈ క్రమంలో సర్వే నంబర్ 437లో గల బీడు భూముల్లో కొద్ది రోజుల క్రితం స్థానిక కర్రెమ్మ గుడి వద్ద నుంచి ఏపీఐఐసీ భూముల్లోకి యంత్రాల సాయంతో దారి ఏర్పాటు చేసుకొని టీడీపీ నాయకులు గుట్టు చప్పుడు కాకుండా మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ మట్టిని గుట్టపాడు వద్ద గల స్టీల్ ప్లాంట్ అవసరాల కోసం చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనుల కొరకు తరలిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. సోమవారం మధ్యాహ్నం ఇటాచీలు, జేసీబీలు, టిప్పర్లతో మట్టిని తరలిస్తుండటంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మధు మరికొంత మంది స్థానికులు అక్కడికి చేరుకొని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో స్థానికులకు టీడీపీ నాయకుడి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామంలో పశువులు మేత మేసేందుకు కూడా అనుమతించని భూముల్లో ఏపీఐఐసీ అధికారులు మట్టి తవ్వకాలకు అనుమతి ఎలా ఇస్తారని నిలదీశారు? విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని మట్టి తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేయాల్సిందిగా నిర్వాహకులకు సూచించారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ విద్యాసాగర్‌ను వివరణ కోరగా.. ఆ భూములు ఏపీఐఐసీకి సంబంధించినవి కావడంతో ఏపీఐఐసీ వారు అంతర్గత రోడ్ల నిర్మాణాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ వారికి ఏ మాత్రం సంబంధం లేని విషయమని పేర్కొన్నారు.

మిరప లోడు వాహనం బోల్తా



హొళగుంద: వందవాగిలి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం మిరప లోడుతో వస్తున్న బొలెరో వాహనం బోల్తా పడింది. అయితే ఎవరికీ ప్రమాదం చోటు చేసుకోలేదు. వందవాగిలికి చెందిన కొందరు రైతులు ఎండు మిరపను కర్ణాటకలోని బ్యాడిగిలో అమ్ముకునేందుకు బొలెరో వాహనంలో తీసుకెళ్తున్నారు. అయితే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది.

టెన్నిస్ క్రీడాకారిణికి అభినందన



క్రీడాకారిణి జఫ్రిన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిన డెఫ్ క్రీడాకారిణి షేక్ జఫ్రిన్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రత్యేకంగా అభినందించారు. ఈమె అహ్మదాబాద్‌లో మార్చి 20 నుంచి 23వ తేదీ వరకు జరిగిన పోటీల్లో మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారు పతకాలు సాధించింది. డబుల్స్‌లో నంద్యాలకు చెందిన సాయి చందన్‌తో కలిసి ప్రతిభ చాటింది. దీంతో 2025 నవంబర్‌లో జపాన్‌లో జరిగే బధిరుల ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో క్రీడాకారిణి జఫ్రిన్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సన్మానించి అభినందనలు తెలిపారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ల పంపిణీ

విభిన్న ప్రతిభావంతులకు ప్రోత్సాహకంగా 3 ల్యాప్‌టాప్‌లు, 2 సెల్‌ఫోన్లను కలెక్టర్ పి.రంజిత్‌బాషా అందించారు. సోమవారం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు వాటిని అందజేసి చదువులో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్వో సీ.వెంకటనారాయణమ్మ, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రాయిస్‌ఫాతిమా, కో–ఆపరేటివ్ అధికారులు రామాంజనేయులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశించినా బేఖాతరు

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే కాటసాని



జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం మార్కాపురం, తడకనపల్లె డీలర్లు మద్దిలేటి, సత్యనారాయణమ్మను కొనసాగించాలని హైకోర్టు ఆదేశించినా రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సోమవారం జేసీ డాక్టర్ బి.నవ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. హైకోర్టు ఆదేశాలను బేఖాతారు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ డీలర్లను తొలగించి టీడీపీ అనుకూల వ్యక్తులకు ఇన్‌చార్జ్ ఇప్పించుకొని వారి ఇళ్ల దగ్గరే చౌక సరుకులను వేస్తున్నారని, ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో హైకోర్టుకు వెళ్లినట్లు వివరించారు. ఇదిలాఉండగా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. నిర్దేశిత సమయంలోపు అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ వారంలో 104 వినతులు రీఓపెన్ అయినట్లు చెప్పారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

నేషనల్ డేటా బేస్‌లో కార్మికుల నమోదు



వివరాల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీఎల్ ఎం.బాలునాయక్

కర్నూలు(అర్బన్): రాష్ట్రవ్యాప్తంగా అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాలను నేషనల్ డేటా బేస్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు సంయుక్త కార్మిక కమిషనర్ ఎం.బాలునాయక్ చెప్పారు. ఈ – శ్రమ్ పోర్టల్‌లో ప్లాట్ ఫాం, గిగ్ కార్మికుల పేర్లను నమోదు చేసే కార్యక్రమానికి సంబంధించి సోమవారం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక వెంకటరమణ కాలనీలోని బిగ్ బాస్కెట్ కార్మికుల నమోదు ప్రక్రియ కార్యక్రమంలో జాయింట్ లేబర్ కమిషనర్ బాలునాయక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత రంగాల్లోని కార్మికులను గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ– శ్రమ్ పోర్టల్ వేదికను రూపొందించిందన్నారు. ఆధార్‌కార్డు, 16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండి, ఈఎస్ఐ, పీఎఫ్ నమోదు కాని వారు ఈ పోర్టల్‌లో నమోదు కావాలని సూచించారు. సీఎస్‌సీ, గ్రామ/వార్డు సచివాలయాలు, సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాల్లో పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిగా రిటైర్డు ఉపాధ్యాయుడు

- పత్తికొండ కోర్టులో తొలిసారి సభ్యత్వం



బోయ వీరస్వామి

పత్తికొండ రూరల్: వృద్ధాప్యం బద్ధకానికే గానీ మన ప్రయత్నానికి కాదని రిటైర్డు టీచర్ నిరూపించారు. గురువుగా పదవీ విరమణ పొంది 74 ఏళ్ల వయసులో న్యాయవాద వృత్తిని స్వీకరించి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు. పత్తికొండలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదిగా సోమవారం రిటైర్డు టీచర్ బోయ వీరస్వామి 74 ఏళ్ల వయసులో సభ్యత్వం తీసుకున్నారు. ఈయన 1984లో ఉపాధ్యాయుడుగా పత్తికొండ మండల పరిధిలోని కోతిరాళ్ల గ్రామంలో విధుల్లో చేరి మళ్లీ అదే గ్రామంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా 2009లో పదవీ విరమణ పొందారు. ఆ తరువాత న్యాయవాద వృత్తిని స్వీకరించాలని 2014–17లో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. హైకోర్టులో ఎన్‌రోల్‌మెంట్ చేసుకుని స్థానిక కోర్టులోని బార్ అసోసియేషన్‌లో నూతన అధ్యక్షుడు మధుబాబు చేతుల మీదుగా సభ్యత్వం తీసుకున్నారు. రిటైర్డు టీచర్ న్యాయవాద వృత్తిలోకి రావడం పత్తికొండ కోర్టులో ఇదే తొలిసారి అని సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

శ్రీశైలం డ్యాం ఈఈగా వేణుగోపాల్



ఈఈ వేణుగోపాల్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

శ్రీశైలంప్రాజెక్ట్: నీలం సంజీవరెడ్డి ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా ఎం.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొద్ది సంవత్సరాలుగా ప్రాజెక్టుకు ఈఈ లేకపోవడంతో డ్యాంకు సంబంధించిన మెయింటెనెన్స్, అదనపు పనులను చేపట్టలేక పోతున్నారు. దీంతో నంద్యాల ఎస్ఆర్‌బీసీ సర్కిల్–1, డివిజన్–3లో ఈఈగా పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డిని ఫుల్ అడిషనల్ చార్జ్ ఈఈగా శ్రీశైలం డ్యాంకు నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఈఈ వేణుగోపాల్‌రెడ్డిని డ్యాం డివిజన్ ఉద్యోగులు శాలువాతో సత్కరించారు.

బెల్టుషాపులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

- గోపవరంలో రోడ్డుపైనే అమ్మకాలు
- దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు

మహానంది: మహానంది మండలం గోపవరం గ్రామంలో రోడ్డుపైనే బెల్టుషాపులు నిర్వహిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళలు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్ రాజకుమారికి సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు ఎక్సైజ్ ఎస్ఐ బ్రహ్మయ్య, పోలీసులు గ్రామంలో దాడులు నిర్వహించి కంబగౌని మద్దిలేటి వద్ద ఆరు హైదరాబాద్ బ్లూ, వెంకటేశ్వర్లు వద్ద ఐదు బెంగళూరు క్వార్టర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

టీడీపీ నేతల అండదండలతోనే..

గ్రామ టీడీపీ నేతల అండదండలతోనే గోపవరంలో ఇద్దరు వ్యక్తులు బహిరంగంగా మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పాటు అమ్మరాదని చెప్పినవారిని బెదిరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలోనూ బెల్టుషాపుల నిర్వహణపై ప్రశ్నించిన యువకులపై కొందరు దాడులకు దిగారు. ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో బెల్టుషాపులు లేకుండా చూడాలని మహిళలు, గ్రామస్తులు కోరుతున్నారు.

మెరుగైన జీవన విధానంతోనే ఆరోగ్యం



దివ్యాంగులకు చక్రాల కుర్చీలు పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, అందుకు అనుగుణంగా జీవన విధానాన్ని మలచుకోవాలని రాష్ట్ర భారీ పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్నూలు డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంకులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 38 మంది దివ్యాంగులకు మంత్రి చేతుల మీదుగా చక్రాల కుర్చీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయని, ఇందులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ముందుంటుందని కొనియాడారు. త్వరలో కర్నూలుకు స్కిన్ సెంటర్ రావడం ఆనందకరమని, ఇది రాష్ట్రంలోనే మొదటిది అవుతుందన్నారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవింద రెడ్డి, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ రయీస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల పందెం అదుర్స్



తలపడుతున్న పొట్టేళ్లు

పగిడ్యాల: శ్రీరామనవమి తిరునాల పురస్కరించుకుని సోమవారం స్థానిక బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిన పొట్టేళ్ల పందెం అదుర్స్ అనిపించింది. పొట్టేళ్లు ఢీ అంటే ఢీ అంటూ ఒకదానికి ఒకటి ఢీకొట్టుకోగా వీక్షకులు ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. ఆహుతుల హర్షధ్వానాల మధ్య పోటీలు ఉత్కంఠగా సాగాయి. పోటీల్లో అల్లర్లు చోటుచేసుకుండా ముచ్చుమర్రి పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి 12 పొట్టేళ్లు పోటీపడగా మొదటి బహుమతి చెరుకుచెర్ల, రెండవ బహుమతి ప్రాతకోట, మూడవ బహుమతి పగిడ్యాల గ్రామాలకు చెందిన పొట్టేళ్ల యజమానులకు లభించాయి. విజేతలైన పొట్టేళ్ల యజమానులకు ఈడిగ సుధాకర్‌గౌడ్ నగదు బహుమతులను అందజేశారు.

కారులో చెలరేగిన మంటలు

- ప్రాణాపాయం నుంచి బయటపడ్డ ముగ్గురు



మంటల్లో చిక్కుకున్న కారు

నందికొట్కూరు: మిడుతూరు మండల పరిధిలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద కారులో మంటలు చెలరేగడంతో అందులో ఉన్న ముగ్గురు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూలు జిల్లా సి.బెళగల్‌కు చెందిన అమానుల్లా మిడుతూరు మండలంలోని బైరాపురం యువతిని వివాహం చేసుకున్నారు. రంజాన్ పండుగకు భార్య పుట్టింటికి వచ్చింది. భార్యను తీసుకెళ్లేందుకు భర్త కారులో వచ్చాడు. కారు రిపేరు కావడంతో మరో ఇద్దరు బంధువులతో కలిసి బైరాపురం నుంచి నందికొట్కూరుకు మెకానిక్ కోసం వచ్చారు. రాత్రి వేళ మెకానిక్ అందుబాటులో లేకపోవడంతో బైరాపురం గ్రామానికి తిరిగి వస్తుండగా నందికొట్కూరు–మిడుతూరు మార్గ మధ్యలో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ఉన్న ముగ్గురు బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. మంటల్లో కారు పూర్తిగా దహనమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

చిర్తనకల్లులో రేషన్ బియ్యం పంపిణీ

సాక్షి ఎఫెక్ట్



రేషన్ పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్ఐ శ్రీరాములు, వీఆర్వో రామాంజనేయులు

కోసిగి: మండల పరిధిలోని చిర్తనకల్లు గ్రామంలో దాదాపు 110 మంది కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా కోటా అయిపోయిందంటూ డీలర్ చేతులెత్తేశాడు. బాధితుల ఆవేదనను ఈ నెల 6వ తేదీన 'సాక్షి' దినపత్రిక 'రేషన్.. పరేషాన్' పేరిట కథనం ప్రచురించి వెలుగులోకి తెచ్చింది. ఇందుకు స్పందించిన తహసీల్దార్ రుద్రగౌడ, ఆర్ఐ శ్రీరాములు, వీఆర్వో రామాంజనేయులు గ్రామానికి చేరుకుని డీలర్ వద్ద రేషన్ బియ్యం కోటాపై విచారణ చేపట్టారు. నెలకొకరు చొప్పున డీలర్ మారుతూ బియ్యం పంపిణీ చేస్తుండడంతో బ్యాక్‌లాగ్ కోటాను ఎవరికి వారే కాజేశారు. దీంతో ఈ నెలలో 110 మంది రేషన్ కార్డుదారులకు బియ్యం తక్కువ వచ్చింది. దీంతో డీలర్లపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనున్న మరో రేషన్ డీలర్ వద్ద నుంచి ఎండీయూ వాహనంలో బియ్యం తీసుకొచ్చి పోర్టబుల్ కింద చిర్తనకల్లు గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. రేషన్ బియ్యం అందడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.